నిబంధనలకు నీళ్లు!

ఎపెరల్ పార్కు లక్ష్యానికి తూట్లు



ఖాళీగా కనిపిస్తున్న ఎపెరల్ పార్కు అడ్మిన్ బిల్డింగ్



ఎపెరల్ పార్కులో ఏర్పాటైన దుస్తుల పరిశ్రమ



కూర్మన్నపాలెం: అధునాతన దుస్తుల తయారీ కేంద్రాల కోసం ఏర్పాటు చేసిన ఎపెరల్ పార్కులో అందుకు భిన్నమైన పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరకపోగా.. భూములు ఇచ్చిన రైతుల్లో కూడా నిరాశ నిస్పృహలు చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచం మెచ్చేలా దుస్తులు తయారు చేసి దేశ విదేశాలకు వాటిని ఎగుమతి చేసేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని 2004లో అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు అనుగుణంగా వడ్లపూడి,ఫకీర్‌తక్యా, జగ్గరాజుపేట తదితర ప్రాంతాల రైతుల నుంచి 146 ఎకరాల భూమిని సేకరించింది. అందుకు అనుగుణంగా ఎపెరల్ పార్కు ఏర్పాటు కోసం 2004 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. అనంతరం ఆ భూమిని 75 ప్లాట్లుగా విభజించి దుస్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులను ఆహ్వానించారు. అప్పట్లోనే అనేక మంది ముందుకు రావడడంతో ప్రభుత్వం వారికి చదరపు మీటరు రూ.250 చొప్పున ధర నిర్ణయించి ఒక్కో పారిశ్రామిక వేత్తకు 2000 నుంచి 5000 వేల చదరపు మీటర్లు చొప్పున కేటాయించింది.

ఎవరి ఇష్టం వారిదే..

దుస్తుల పరిశ్రమల కోసం ఏపీఐఐసీ నుంచి స్థలాలు పొందిన వారిలో కొంతమంది పారిశ్రామిక వేత్తలు మాత్రమే దుస్తుల పరిశ్రమలు ఏర్పాటు చేశారు. మిగిలిన వారు తమకు నచ్చిన పరిశ్రమ ఏర్పాటు చేసుకోగా.. ఇంకొంత మంది తమకు కేటాయించిన స్థలాలను అద్దెకు ఇచ్చేసుకున్నారు. హిరావత్, వాట్‌టాస్, గణపతి,విన్‌సు వంటి 20 సంస్థలు మాత్రమే దుస్తుల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యాపారాలను కొనసాగిస్తున్నాయి. మిగిలిన స్థలాల్లో క్రేన్లు, మరమ్మత్తులు, కంటైనర్ తయారీ, ఇతర వెల్డింగ్ షాపులు ఏర్పాటు చేసి ప్రభుత్వ సంకల్పాన్ని నీరు గార్చారు.

ఆందోళన

ప్రమాదకర పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనన్న భయంతో దుస్తుల తయారీ కేంద్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట ఎపెరల్ పార్కులోని పరుపుల పరిశ్రమకు నిప్పు అంటుకొని భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎపెరల్ పార్కులో వేరే పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. దుస్తుల పరిశ్రమలకు అనువైన ప్రదేశం గాజువాక ఆటోనగర్ అని గుర్తించిన అధికారులు వడ్లపూడి, యాదవజగ్గరాజపేట ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా వేరే పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వేరే పరిశ్రమ

నిర్వాసితులకు దొరకని ఉపాధి

ఇక నిర్వాసితుల సమస్య కూడా ఉండనే ఉంది. దుస్తుల పరిశ్రమల ఏర్పాటుకు భూములు కోల్పోయిన వారికి ఉపాధి కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. ఆ హామీలు అమలు కాలేదు. 10 నుంచి 20 శాతం మంది మాత్రమే స్థానికులు ఉపాధి పొందుతున్నారని నిర్వాసితులు చెబుతున్నారు. మిగిలిన వారి విషయంలో కూడా అధికారులే శ్రద్ధతీసుకొని నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇతర సంస్థలు వద్దు



దుస్తుల పరిశ్రమలకు కేటాయించిన స్థలాల్లో వేరే సంస్థలు ఎలా స్థాపిస్తారు. వాటి వల్ల ప్రమాదాలు ఏర్పడితే ఎవరు బాధ్యత తీసుకుంటారు. అధికారులు తక్షణమే అటువంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలి. దుస్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలి. – ఐ. రాము, నిర్వాసిత నాయకుడు, వడ్లపూడి

ఉపాధి కల్పించాలి



దుస్తుల పరిశ్రమల్లో నిర్వాసితులకు న్యాయం జరగడంలేదు. ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నారు. స్థానికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిర్వాసితుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలి. – కర్రి చిన్నారి, నిర్వాసితురాలు

కాలుష్యం బెడద



ఎపెరల్ పార్కులో వేరే పరిశ్రమలు ఉండడం వల్ల కాలుష్యం కూడా పెరుగుతోంది. ఏ ఉద్దేశంతో ప్రభుత్వం ఎపెరల్ పార్కును ఏర్పాటు చేసిందో అందుకు అనుగుణంగానే చర్యలు చేపట్టాలి. అంతే తప్పా ప్లాటు ఒకదానికోసం తీసుకొని వేరే పరిశ్రమ ఏర్పాటు చేయడం పద్ధతి కాదు. –బొండా రాజు, వడ్లపూడి

క్లుప్తంగా

రామజోగయ్య శాస్త్రికి సత్కారం



సినీగేయ రచయిత రామజోగయ్య శాస్త్రిని సత్కరిస్తున్న వ్యాసశర్మ

అగనంపూడి: సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మారక పురస్కారం అందుకోడానికి విశాఖ విచ్చేసిన సినీగేయ రచయిత రామజోగయ్య శాస్త్రికి విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలిండియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ, అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్, ప్రతినిధి విశ్వనాథం ఘనంగా సత్కరించారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు సత్కారం

అగనంపూడి: యూనియన్ బ్యాంక్ అగనంపూడి శాఖ సీనియర్ మేనేజర్‌గా గుడివాడ సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ బ్రాంచ్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆమెను ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి, ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు, ఎస్.సింహాచలం, పి.అచ్యుత్ ఘనంగా సత్కరించారు.

మోదకొండమ్మ సేవలో..



మోదకొండమ్మ ఆలయంలో పారాయణ చేస్తున్న బొర్రమాంబ పారాయణ బృందం

అగనంపూడి: పాడేరు మోదకొండమ్మ ఆలయ మూడు వారం సందర్భంగా అగనంపూడి పారాయణ బృందం లలిత, విష్ణు సహస్ర పారాయణ చేశారు. తర్వాత అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

పెదగంట్యాడ: స్థానిక సిద్దేశ్వరం రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో హోటల్ యాజమాన్యంతో పాటు సిబ్బంది, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపకసిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు స్పందించారు. సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

85వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా దశేంద్ర



అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా కర్రి దశేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, డొక్కా రమేష్, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు దశేంద్రతో పాటు నూతనంగా పదవులు పొందిన వారిని అభినందించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: తన విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై ట్రాఫిక్ ఎస్‌ఐ విజయకుమార్ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక బీసీ రోడ్డులో ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్ కుమార్ మంగళవారం రాత్రి వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో బుల్లెట్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి వాహన రికార్డులు చూపాలని పోలీసులు అడిగారు. ఆ సమయంలో వాహనం నడుపుతున్న ప్రసాద్ అతని భార్య విధులకు ఆటంకం కల్పించే విధంగా మాట్లాడారని పేర్కొన్నారు.

అధినేతతో ఆత్మీయ కలయిక



జగన్ మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



అధినేతతో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉరుకూటి చందు



జగన్ మోహన్‌రెడ్డితో కార్పొరేటర్ గుడివాడ అనూష కుటుంబం



జగన్ మోహన్‌రెడ్డితో విద్యార్థి సంఘం నాయకుడు జీలకర్ర నాగేంద్ర

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక నాయకులు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాడేపల్లిలో మంగళవారం నిర్వహించిన విస్తృత సమావేశం అనంతరం నాయకులు తమ అధినేతను కుటుంబ సభ్యులతో సహా కలిశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తన కుమారుడితో అధినేతను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, ఆయన తండ్రి ఉరుకూటి అప్పారావు, భార్య ఉరుకూటి లక్ష్మి, సోదరి పీతల అరుణతో జగన్ మోహన్‌రెడ్డి కలిసి యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, 60వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ తన సోదరుడు మహ్మద్ లుక్మన్‌తో, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష తన భర్త గుడివాడ లతీష్, పిల్లలతో అధినేతను కలిశారు.

బోయమాంబ.. చల్లగ చూడమ్మా



అమ్మవారికి పూజలు చేస్తున్న కోమటి శ్రీనివాసరావు



అమ్మవారికి పూజలు చేస్తున్న బొడ్డగోవింద్

కూర్మన్నపాలెం: స్థానిక అప్పికొండకాలనీ గ్రామ దేవత బోయాలమ్మ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పెద్దలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్.దేముడు, గణపతి, సోమునాయుడు, కాలనీ వాసులు పాల్గొన్నారు. వార్డుకు చెందిన మరో నాయకుడు బొడ్డగోవింద్ అమ్మవారిని దర్శించుకున్నారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్ బోయమాంబతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు అరుణకిరణ్, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలర్ నుంచి జారిన ఐరన్ షీట్ రోల్



జారిపడ్డ ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం



ఐరన్ షీట్ జారిపడిన ట్రాలర్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్ లారీ నుంచి మంగళవారం వేకువజామున ఐరన్ షీట్ రోల్ జారి పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. షీలానగర్ నుంచి ఆటోనగర్ లోపలకు ట్రాలర్‌పై ఐరన్ షీట్ రోల్స్ వెళ్తున్నాయి. సరిగ్గా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి మలుపు తిరుగుతున్న ట్రాలర్‌పై నుంచి రోల్ రోడ్డు మధ్యలో పడిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వెంటనే ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగింది. రోల్ అవ్వకుండా చైన్‌తో కట్టడం, ఐరన్ బెల్టులతో బిగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ వీటిని తరలించేటప్పుడు కింద రోల్ అవ్వకుండా చెక్కలు, ఇతర దిమ్మలు లాంటి వాటిని తూతూ మంత్రంగా పెట్టి తరలిస్తుంటారు. వీటిపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

బాలుడిని రక్షించిన లైఫ్ గార్డ్స్



బాలుడితో లైఫ్ గార్డ్స్

పెదగంట్యాడ: యారాడ తీరంలో సరదాగా ఈతకు దిగి, అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఓ బాలుడిని లైఫ్ గార్డ్స్ మంగళవారం రక్షించారు. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్, కర్మఘాట్‌కు చెందిన కొందరు కుటుంబాలతో విశాఖ పర్యటనకు వచ్చారు. అందులో భాగంగా యారాడ తీరాన్ని మంగళవారం ఉదయం సందర్శించారు. కాసేపు ఇసుక తిన్నెలపై గడిపి, ఆ తర్వాత సరదాగా సముద్రంలో స్నానానికి దిగారు. ఒక్కసారిగా అలల ఉధ్ధృతి పెరగడంతో అభిమన్యు(15) అనే బాలుడు కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ కదిరి లోవరాజు, పల్లేటి తాతారావు, కదిరి వెంకటేష్, కదిరి లోవేష్ స్పందించారు. ఆ బాలుడిని రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో బాలుని కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

సంగీతంతో మమేకమైనది సంస్కృత భాష



కృతులు ఆలపిస్తున్న మండా సుధారాణి

సీతంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం, ఎస్వీ కాలేజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) సంయుక్తంగా మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కర్ణాటక సంగీత అనుభవాన్ని ఉన్నతీకరించడంలో సంస్కృత భాష'అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సంగీత సుధానిధి మండా సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై కర్ణాటక సంగీతంలో సంస్కృత భాష ప్రాముఖ్యత గురించి వివరించారు. సంస్కృత భాషలోని పదాలు, వాటి ఉచ్చారణ, అర్థం, భావం సోదాహరణంగా వివరించారు. పలు త్యాగరాజ, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ కృతులను ఆలపించి వాటిలో సంస్కృత భాష ఉన్నతిని వివరించారు.

గార్మెంట్స్ మేకింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సీతమ్మధార ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సహకారంతో ఈ నెల 23వ తేదీ నుండి మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమర్థ్ కార్యక్రమం క్రింద 18–40 సంవత్సరాల వయసు కలిగి, కనీసం 8 నుండి 10వ తరగతి వరకు చదువుకున్న మహిళలకు ఇండస్ట్రియల్ గార్మెంట్ మేకింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలం ముగిసిన తర్వాత వారికి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సర్టిఫికెట్లు అందజేసి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు మే 23వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ శిక్షణలో చేరగోరు వారు 63014 41183 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె



భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

అక్కిరెడ్డిపాలెం: దేశంలో ఉగ్రదాడులు, కొన్ని రాష్ట్రాల్లో యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సమ్మె జూలై 9కి వాయిదా పడినట్లు సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. భెల్ ప్రధాన గేటు ఎదుట మంగళవారం అఖిలపక్షం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణ నిలుపుదల చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26000 చెల్లించాలనే డిమాండ్స్‌తో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీఎస్ రాజు, సీతన్నాయుడు, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో చండీ హోమం



లలితాపీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో వైశాఖ మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తకంగా చండీ హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్ఠాపన, గోపూజ, పరివార పూజ, సుహాసినీ పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి..

వైశాఖ బహుళ దశమి సందర్భంగా ఈ నెల 22న హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలకు విశేష అభిషేకం, అర్చన, 10 గంటలకు మన్యు సూక్త సహిత మూల మంత్ర హోమం, సాయంత్రం 6 గంటలకు సహస్ర నామార్చన జరుగుతాయని తెలిపారు.

తూనికలు, కొలతల్లో కచ్చితత్వం అవసరం



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ రాజేష్

సీతంపేట: వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్, డిప్యూటీ కంట్రోలర్ కె.టి.రవి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకం , కొలతల్లో కచ్చితత్వం కోసం వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. కొనుగోలు సమయంలో వస్తు నాణ్యత, వాటి తయారీ, తూనిక, కొలతలు, ఎమ్మార్పీ వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్యాకేజీ రూపంలో ఉండే ఏ వస్తువుకైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర వినియోగదారులు చెల్లించనవసరం లేదన్నారు. వినియోగదారులు ఎలా మోసపోతున్నారు, వ్యాపారులు ఎలా మోసగిస్తారో వివరించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర డిమాండ్ చేస్తే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో విశాఖ కన్జ్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధి శత్రుఘ్నుడు, అసిస్టెంట్ కంట్రోలర్లు పి.డి.వి.అప్పలరాజు, బి.రామచంద్రయ్య, పి.చిన్నమ్మ, ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, ఎస్.ఉమా సుందరి పాల్గొన్నారు.